క్లుప్తంగా

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



మచిలీపట్నంటౌన్: 49వ డివిజన్‌లో అనారోగ్యంతో బాధపడుతున్న చింతా గిరిధర్ వైద్య ఖర్చుల కోసం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును గురువారం వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) అందజేశారు. గిరిధర్ వైద్య సేవల కోసం ప్రభుత్వం మంజూరు చేసిన లక్ష రూపాయల చెక్కును కార్పొరేటర్ పల్లి శేఖర్‌తో కలిసి అందజేశారు.

నేడు సచివాలయ భవనం ప్రారంభం

బంటుమిల్లి: స్థానికంగా నిర్మాణం పూర్తి చేసుకున్న బంటుమిల్లి–1 సచివాలయ నూతన భవనాన్ని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ శుక్రవారం ప్రారంభిస్తారని సర్పంచ్ వెంట్రప్రగడ కృష్ణవేణి తెలిపారు. పంచాయతీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొని విజయవంతం చేయాలని ఆమె కోరారు.

నేడు కోడూరులో గడప గడపకు మన ప్రభుత్వం

కోడూరు: కోడూరు పంచాయతీలోని కోడూరు–3 సచివాలయ పరిధిలో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుందని జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకట సత్యనారాయణ గురువారం తెలిపారు. ఉదయం ఏడు గంటలకు ఎమ్మెల్యే రమేష్‌బాబు కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని చెప్పారు. ఇంటింటికి వెళ్లి స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకుంటారన్నారు.

మంచినీటి సమస్య పరిష్కారం

మోపిదేవి: మోపిదేవి వెలుగు కార్యాలయ సిబ్బందికి తాగునీటి సమస్య పరిష్కారం అయిందని డీఆర్‌డీఏ ఏపీఎం శ్రీనివాస్ తెలిపారు. మండల మహిళా సమైఖ్య సంఘం కార్యాలయంలో గురువారం పంచాయతీ ఆధ్వర్యంలో కుళాయి ఏర్పాటు చేశారు. మహిళలు కోరిన వెంటనే కుళాయి ఏర్పాటు చేసిన సర్పంచ్ నందిగం మేరీరాణికి ఏపీఎం శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు. నందిగం అభిషేకరావు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

రేపటి నుంచి బ్రహ్మోత్సవాలు

మచిలీపట్నంటౌన్: బచ్చుపేటలోని వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో స్వామివారి తిరు కల్యాణ బ్రహ్మోత్సవాలు ఏప్రిల్ 1 నుంచి 10వ తేదీ వరకు జరుగుతాయని ఆలయ ధర్మకర్తల మండలి వ్యవస్థాపక చైర్మన్ ముత్తేవి రవికాంత్, కార్యనిర్వహణాధికారి ఎస్ఎస్ చక్రధరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. స్వామివారి బ్రహ్మోత్సవాలకు భక్తులు తరలిరావాలని కోరారు. ఈ సందర్భంగా సాయంత్రం వేళల్లో ఆలయ ప్రాంగణంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయని వివరించారు.

లంకమ్మ అమ్మవారి గ్రామోత్సవం ప్రారంభం



అవనిగడ్డ: దివిసీమ భక్తుల ఇలవేల్పుగా పూజలందుకుంటున్న లంకమ్మ అమ్మవారి గ్రామోత్సవం గురువారం ఘనంగా ప్రారంభమైంది. తొలుత అమ్మవారికి ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ అన్నపరెడ్డి రాందాస్, ఆలయ ఈఓ పి. సీతారామయ్య ప్రత్యేక పూజలు చేశారు. రాందాస్‌తో పాటు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు అమ్మవారి బయట తీసుకొచ్చి ప్రత్యేక వాహనంపై ఉంచారు. పలు ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చిన భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామోత్సవం జరిగింది.

నేడు బంటుమిల్లిలో ఆసరా పంపిణీ

బంటుమిల్లి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీ ఆవరణలో శుక్రవారం వైఎస్సార్ ఆసరా సొమ్ముల విడుదల కార్యక్రమం జరుగుతుందని ఎంపీపీ వి. చినబాబు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులు ఎం. రాజబాబు తెలిపారు. రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ ముఖ్యఅతిథిగా పాల్గొని డ్వాక్రా సభ్యులకు చెక్కు అందజేస్తారన్నారు.

రాయవరంలో..

గూడూరు: గూడూరు మండలం రాయవరం గ్రామంలో శుక్రవారం వైఎస్సార్ ఆసరా పంపిణీ జరుగుతుందని ఎంపీడీఓ డి. సుబ్బారావు తెలిపారు. సాయంత్రం నాలుగు గంటలకు నిర్వహించే కార్యక్రమంలో మంత్రి జోగి రమేష్ రాయవరం క్లస్టర్ పరిధిలోని డ్వాక్రా మహిళలకు చెక్కు అందజేస్తారని చెప్పారు.

నేడు పశు వైద్యశాల ప్రారంభం

మచిలీపట్నంటౌన్: చిలకలపూడిలో నూతనంగా ఏర్పాటు చేసిన పశు వైద్యశాల (వెటర్నరీ విజిటింగ్ సెంటర్)ను ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని) శుక్రవారం ఉదయం 10 గంటలకు ప్రారంభిస్తారని పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు ఏవీ రమణయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఉచిత పశు వైద్యశిబిరం నిర్వహిస్తామన్నారు.

కమనీయం.. రాములోరి కల్యాణం

- వాడవాడలా శ్రీరామ నవమి వేడుకలు
- కల్యాణాన్ని తిలకించి తరించిన భక్తులు
- పలుచోట్ల అన్నసమారాధనలు





వెంకటాపురం కోదండ రామాలయం పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే రమేష్‌బాబు, నరసింహారావు ; బందరులో కల్యాణంలో పాల్గొన్న పేర్ని నాని దంపతులు



కోడూరు రామాలయం వద్ద కల్యాణం నిర్వహిస్తున్న దంపతులు



పెడన బస్టాండు వద్ద రాములోరి కల్యాణం



కృత్తివెన్ను మండలం గాంధీనగరంలో అలంకరణలో స్వామివారి మూలవిరాట్‌లు

కోడూరు: శ్రీరామ నవమి వేడుకలు అవనిగడ్డ, మచిలీపట్నం, పెడన నియోజకవర్గాల్లో గురువారం వైభవంగా జరిగాయి. ఆలయాలు, వివిధ కూడళ్లలో ఏర్పాటు చేసిన చలువ పందిళ్ల వద్ద సీతారాముల కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. పలువురు ప్రముఖులు పీటలపై కూర్చుని కల్యాణం జరిపించారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని కల్యాణాన్ని తిలకించారు. భక్తులకు వడపప్పు, పానకాన్ని ప్రసాదంగా పంపిణీ చేశారు. పలుచోట్ల అన్న సమారాధనలు నిర్వహించారు. కోడూరు యర్రారెడ్డి వారిపాలెం రామాలయం, విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలోని రామాలయం వద్ద స్వామివార్ల విగ్రహాలను ఊరేగించి కల్యాణం జరిపించారు. షిర్డీ సాయి దివ్య జ్ఞాన ధాన్య మందిరం, కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయాల్లో నవమి వేడుకలను భక్తి ప్రపత్తులతో నిర్వహించారు. నక్కవానిదారి, జరుగువానిపాలెం, పోటుమీద, ఉల్లిపాలెం, స్వతంత్రపురం గ్రామాల్లోని రామమందిరాల కమిటీల సభ్యులు డప్పువాయిద్యాలు, మేళతాళాల నడుమ స్వామివారి చిత్రపటాలను ప్రత్యేక వాహనాల్లో ఊరేగిస్తూ ఉల్లిపాలెంలోని కృష్ణానది వద్దకు తీసుకువెళ్లి పుణ్యస్నానాలు చేయించారు. పిట్టల్లంక రామాలయం స్వామివార్ల కల్యాణం జరిపి, అన్నసమారాధన నిర్వహించారు. శుక్రవారం మెరకగౌడపాలెం రామాలయం వద్ద అన్నసమారాధన నిర్వహిస్తామని ఆలయ కమిటీ తెలిపింది.

వాడవాడలా వేడుకలు

మోపిదేవి: వెంకటాపురం కోదండ రామాలయంలో సీతారాముల వారిని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు, రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జీ కడవకొల్లు నరసింహారావు దర్శించుకున్నారు. రావివారిపాలెంకు చెందిన పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు పరుచూరి అంజయ్య ఆర్థిక సౌజన్యంతో స్వామివార్ల అలంకరణకు కిరీటాలు బహూకరించారు. మోపిదేవిలో ఎంపీపీ రావి దుర్గావాణి, రావి నాగేశ్వరరావు దంపతులు నేతృత్వంలో సీతారాముల కల్యాణం ఘనంగా నిర్వహించారు. మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి దేవస్థానంలో ఆలయ ఏసీ ఎన్ఎస్ చక్రధరరావు ఆధ్వర్యంలో పూజలు నిర్వహించి భక్తులకు పానకం అందజేశారు. స్థానిక గౌడపాలెం, యాదవపాలెంలో ఆయా సంఘాల ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణం నిర్వహించి అన్నదానం చేశారు. అయోధ్య గ్రామంలో కోనేరు ప్రభాకరరావు ఆధ్వర్యంలోనూ, అన్నవరం, పెదప్రోలు తదితర గ్రామాల్లో సీతారాముల కల్యాణోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో కల్యాణం

పెడన: పెడన బస్టాండ్ సమీపంలోని గణపతి సాయి సీతారామాంజనేయ స్వామి వారి దేవస్థానం వద్ద గౌడ సంఘం ఆధ్వర్యంలో కల్యాణ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పామర్తి గంగాధరం, నాగ అమృతవాణి దంపతులచే పండితులు కల్యాణాన్ని జరిపించారు. కాపులవీధిలోని రామాలయంలో సీహెచ్ రాంబాబు, లావణ్య దంపతులు సీతారాముల కల్యాణాన్ని జరిపించారు. అనంతరం అన్నసమారాధన నిర్వహించారు. పాత కూరగాయల మార్కెట్ వీధిలోని కోదండ రామాలయంలో నందం సోమనాథ్, పద్మిని దంపతులచే కల్యాణం జరిపించారు. ఆరో వార్డు గుణ్ణాలపల్లిలోని రామాలయంలో కోడూరు కృష్ణారావు దంపతులు కల్యాణాన్ని నిర్వహింపజేశారు. మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ కటకం ప్రసాద్, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు బండారు మల్లి, నాయకులు కోడూరు శ్రీను, బొర్రా మహేష్‌లు దర్శించుకున్నారు. భారీ అన్న సమారాధన నిర్వహించారు. తోటమూలోని రామాలయంలో వరుదు రామకృష్ణ దంపతులు, చేవేంద్రపాలెం గ్రామంలోని రామాలయంలో కూనపురెడ్డి సూర్యభానుతేజ, స్వాతి దంపతులచే కల్యాణం నిర్వహింపచేశారు. పలు చోట్ల జరిగిన అన్నసమారాధనలో భక్తులు స్వామివారి తీర్థప్రసాదాలను స్వీకరించారు.

- బంటుమిల్లి: బంటుమిల్లి, పెందుర్రు, అర్తమూరు, ముంజులూరు, పెదతుమ్మిడి, మల్లేశ్వరం, చోరంపూడి తదితర గ్రామాల్లోని రామాలయాల్లో స్వామివారి కల్యాణం కోసం మండపాలను సుందరంగా అలంకరించారు. పెదతుమ్మిడి, జానకీరామపురం తదితర గ్రామాల్లోని మందిరాల వద్ద చలువ పందిళ్లు ఏర్పాటు చేసి రాములవారి కల్యాణం ఘనంగా నిర్వహించారు. పలువురు భక్తులు పలు కూడళ్ల వద్ద ప్రసాదాలు, పానకం పంచిపెట్టారు. బంటుమిల్లి రామాలయం వద్ద కల్యాణం అనంతరం అన్నసమారాధనలో నిర్వహించారు.
- కృత్తివెన్ను: యండపల్లి, అడ్డపర్ర, పెదచందాల గ్రామాలలోని రామాలయాల వద్ద కల్యాణం అనంతరం భారీ అన్నసమారాధనలు నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా పెదచందాల గ్రామంలో సీతారామ అభయాంజనేయ భక్త సమాజం వారి దైవ సంకీర్తనార్చన భక్తులను విశేషంగా అలరించింది. కార్యక్రమం అనంతరం ఆలయ కమిటీ వారు బృంద సభ్యులను ఘనంగా సన్మానించారు.

మోపిదేవి: అన్నవరం నుంచి యువతీ, యువకులు పెదకళ్లేపల్లిలో ఉత్తర దిక్కుగా ప్రవహిస్తున్న కృష్ణా నదిలో స్నానాలు చేసి దారిపొడవునా భజనలు చేస్తూ ఆలయానికి చేరుకున్నారు. మోపిదేవి, పెదప్రోలు తదితర గ్రామాల్లో ట్రాక్టర్లు, ఎడ్లబండ్లపై ఊరేగింగా గ్రామానికి చేరుకున్నారు. అనంతరం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన చలువ పందిళ్లలో సీతారాముల కల్యాణం, అనంతరం అన్నదానం నిర్వహించారు.

- లక్ష్మీపురం(చల్లపల్లి): శివరామదుర్గాపురంలోని కోదండ రామాలయంలో గ్రామ ప్రముఖులు తిరందాసు సత్యనారాయణ–అమ్మాజీ దంపతుల ఆధ్వర్యంలో శ్రీరామ నవమి వేడుకలు నిర్వహించారు. ఆలయానికి తిరందాసు రామకృష్ణ - బిందు మాధవి దంపతులు సీతారామ లక్ష్మణ, హనుమల పంచలోహ విగ్రహాలను బహూకరించారు. తిరందాసు సత్యనారాయణ దంపతులు, రామకృష్ణ దంపతులు, సాయి–సాగరిక దంపతులచే ఆలయ ప్రధాన అర్చకులు స్వర్ణ శివ సుబ్రహ్మణ్యం రాముల వారి కల్యాణం జరిపించారు. అనంతరం అన్నసమారాధన చేశారు.

పోలీసు కల్యాణ మండపంలో వేడుకలు



సీతారాముల కల్యాణోత్సవాన్ని జరిపిస్తున్న అడిషనల్ ఎస్పీ దంపతులు

కోనేరుసెంటర్: కృష్ణా జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో మచిలీపట్నంలోని పోలీసు కల్యాణ మండపంలో గురువారం సీతారాముల కల్యాణోత్సవాలను పోలీసు అధికారులు ఘనంగా నిర్వహించారు. జిల్లా అడిషినల్ ఎస్పీ ఎన్. వెంకట రామాంజనేయులు దంపతులు పీటలపై కూర్చుని సీతారాముల కల్యాణాన్ని జరిపించారు. పోలీసు కుటుంబాలు పెద్ద ఎత్తున పాల్గొన్నాయి. కల్యాణ మహోత్సవం అనంతరం అడిషినల్ ఎస్పీ దంపతులు పోలీసు కుటుంబాలకు స్వామి వారి తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. తొలుత పోలీసు రామాలయంలో ఏఎస్పీ దంపతులు సీతారాములును దర్శించుకున్నారు. ఏఆర్ అడిషినల్ ఎస్పీ ఎస్‌వీ ప్రసాద్, దిశ డీఎస్పీ గోపు రాజీవ్‌కుమార్, సీఐలు, ఎస్ఐలు, ఆర్ఐలు, ఏఆర్ ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

చూసిన కనులదే భాగ్యము

మచిలీపట్నంటౌన్: నగరంలోని భద్రాద్రి శ్రీరాముల వారి దేవాలయంలో సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. కూనపరెడ్డి శ్రీకృష్ణారావు దంపతులతో పాటు ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ అనుమకొండ శ్రీధర్ దంపతులు పీటలపై కూర్చున్నారు. వందలాది మందికి అన్నసమారాధన నిర్వహించారు. స్వామివారిని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు), నగర మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ తదితరులు దర్శించుకున్నారు. సాయంత్రం స్వామివార్లను హనుమంత వాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. లక్ష్మీటాకీసు సెంటరులోని వైకుంఠ రామాలయంలో జరిగిన సీతారాముల కల్యాణోత్సవంలో ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని), జయసుధ దంపతులు పాల్గొన్నారు. అనంతరం ఆలయం వద్ద అన్నసమారాధన నిర్వహించారు. ఆలయ ప్రతినిధి, కార్పొరేటర్ పరింకాయల విజయ్, మాజీ కౌన్సిలర్ గూడవల్లి నాగరాజు పర్యవేక్షించారు. రాజుపేట చెక్కలమేడ సమీపంలోని కోదండ రామాలయం వద్ద సీతారామ కల్యాణం వైభవంగా నిర్వహించారు. నూకల తేజారామ్, జయశ్రీ, నల్లనాగుల సునీల్‌కుమార్, నళిని దంపతులు పీటలపై కూర్చున్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. కోనేరుసెంటర్‌లో పండ్ల వర్తక సంఘం, బులియన్ మర్చంట్స్ అసోసియేషన్, నార్లకొట్ల వీధిలో రామాలయం, రంగనాయకస్వామి దేవస్థాన వాణిజ్య దుకాణాల నిర్వాహకుల ఆధ్వర్యంలో నగరంలోని పలు ప్రాంతాల్లోని రామాలయాల్లో, ఇతర దేవాలయాల్లో సీతారాముల కల్యాణోత్సవాలు నిర్వహించి అన్నసమారాధన చేశారు. ఇనుగుదురుపేటలోని శ్రీరామ భజన మందిరంలో పలు జంటలు స్వామివారి కల్యాణంలో పాల్గొన్నారు. కొబ్బరితోటలోని సాయి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణ మహోత్సవం, అన్నసమారాధన నిర్వహించారు. ఆలయాల వద్ద జరుగుతున్న కల్యాణోత్సవాలకు పేర్ని కిట్టు హాజరై స్వామివార్లను దర్శించుకున్నారు.



మల్లేశ్వరంలో నిర్వహించిన కల్యాణంలో పాల్గొన్న దంపతులు



రాజుపేట రామాలయం వద్ద అన్నసమారాధన



శివరామదుర్గాపురంలో రాములవారి కల్యాణం జరిపిస్తున్న దంపతులు

వైభవంగా శ్రీరామ శోభాయాత్ర

వందలాది బైక్‌లతో ర్యాలీలో పాల్గొన్న భక్తులు



శోభాయాత్రలో పాల్గొన్న మేయర్ వెంకటేశ్వరమ్మ, పేర్ని కిట్టు, షేక్ సలార్‌దాదా

మచిలీపట్నంటౌన్: శ్రీరామ నవమి సందర్భంగా హిందూ చైతన్య వేదిక ఆధ్వర్యంలో గురువారం నగరంలో శ్రీరామ శోభాయాత్ర వైభవంగా నిర్వహించారు. హిందూ కళాశాల నుంచి ప్రారంభమైన బైక్ ర్యాలీలో వందలాది మంది భక్తులు స్వచ్ఛందంగా పాల్గొని జై శ్రీరామ్.. జై హనుమాన్.. నినాదాలతో ఉత్సాహంగా ముందుకు సాగారు. నగరంలోని ప్రధాన రోడ్ల వెంట ర్యాలీ సాగింది. ర్యాలీలో వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు), నగర మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ, డెప్యూటీ మేయర్లు లంకా సూరిబాబు, తంటిపూడి కవిత థామస్ నోబుల్, వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు, నాయకులు పాల్గొని సంఘీభావం తెలిపారు. మైనార్టీ వర్గానికి చెందిన మునిసిపల్ మాజీ చైర్మన్ షేక్ సలార్‌దాదా, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ షేక్ అచ్చెబా తదితర నాయకులు శోభాయాత్రలో పాల్గొని సంఘీభావం తెలిపి మత సామరస్యాన్ని చాటిచెప్పారు. శ్రీరాముల వారి జీవిత విశేషాలను సమాజానికి తెలిపేందుకు ఈ యాత్ర చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు.

వెల్లివిరిసిన మత సామరస్యం

శ్రీ రామ శోభాయాత్రలో మత సామరస్యం వెల్లివిరిసింది. పలు కూడళ్ల వద్ద ముస్లింలు మజ్జిగ శిబిరాలను ఏర్పాటు చేశారు. యాత్రలో పాల్గొన్న వారికి అందించి మత సామరస్యాన్ని చాటుకున్నారు. వైఎస్సార్ సీపీ 35వ డివిజన్ ఇన్‌చార్జి షేక్ ఇక్బాలీ, వైఎస్సార్ సీపీ నాయకులు బాషు, షేక్ మౌలాలి, మొహసిన్, ఖాలిద్, ముస్లింలు నాగపోతరావు సెంటర్‌లో హిందువులకు మజ్జిగ పంపిణీ చేశారు.

టిఫిన్ బండి వితరణ

రామవరప్పాడు: ఓ పేద కుటుంబానికి గురువారం సీవీఆర్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో టిఫిన్ బండిని అందజేశారు. ఎనికేపాడుకు చెందిన మురుగన్‌కు నాలుగు చక్రాల టిఫిన్ బండిని లయన్స్ క్లబ్ ప్రతినిధులు అందించారు. లయన్స్ క్లబ్ మాజీ గవర్నర్ మిరియాల వెంకటేశ్వరరావు, క్లబ్ అధ్యక్షుడు శరాబందిరావు, మాజీ ఏసీపీ కె.సూర్యచంద్రరావు, జిల్లా లయన్స్ క్లబ్ కేబినెట్ నాయకులు షేక్ అబ్దుల్ రషీద్ పాల్గొన్నారు.

ముస్లిం మైనార్టీల సంక్షేమానికి సీఎం కృషి

కైకలూరు(కలిదిండి): రాష్ట్రంలో ముస్లింల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృత నిశ్చయంతో పనిచేస్తున్నారని ఏలూరు జిల్లా వక్ఫ్ బోర్డు డైరెక్టర్ ఎస్‌కే చాన్‌బాషా అన్నారు. కలిదిండి మిలట్రీపేట నూతన మసీదులో శుక్రవారం నిర్వహించిన రంజాన్ ప్రత్యేక ప్రార్థనల్లో ఆయన పాల్గొన్నారు. అనంతరం ఇటీవల వక్ఫ్ బోర్డు డైరెక్టర్‌గా ఎన్నికైన చాన్‌బాషాను పలువురు ముస్లిం పెద్దలు సన్మానించారు. నియామకానికి సిఫార్సు చేసిన ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్)కు కృతజ్ఞతలు తెలిపారు. ముస్లింల సంక్షేమానికి కృషి చేస్తానని డైరెక్టరు చాన్‌బాషా చెప్పారు. కార్యక్రమంలో ముస్లిం పెద్దలు సయ్యద్ గఫర్, అమీర్, ఉస్మాన్, ఎండీ కమల్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

సీతారాముల విగ్రహాల బహూకరణ



ప్రతిష్ఠించిన స్వామివార్ల నూతన విగ్రహాలు

కోడూరు: అపర శబరిమలగా పేరుగాంచిన కోడూరు అయ్యప్పస్వామివారి దేవాలయానికి నూతన సీతారామచంద్రస్వామి వార్ల విగ్రహాలను దాతలు బహూకరించారు. కోడూరుకు చెందిన నాగం బాపయ్య గతంలో సీతా, రాముడు, లక్ష్మణుడు, ఆంజనేయస్వామి, వినాయకుడి విగ్రహాలను బహూకరించారు. ప్రస్తుతం ఆ విగ్రహాలు జీర్ణావస్థకు చేరడంతో మళ్లీ బాపయ్య సుమారు రూ.25 వేలు విలువ చేసే స్వామివార్ల విగ్రహాలను గురువారం ఆలయ కమిటీకి అందించారు. నూతన విగ్రహాలను వేద పండితుల మంత్రవచనాల నడుమ ప్రత్యేక మండపంలో ప్రతిష్ఠించారు. శ్రీరామ నవమి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో స్వామివారి కల్యాణోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. స్వామివార్ల అలంకారం విశేషంగా ఆకట్టుకుంది. అనంతరం అన్నసమారాధన నిర్వహించారు.

పంట నష్టం వివరాలు నమోదు

పెనమలూరు: ఇటీవల కురిసిన వానలు, ఈదురు గాలులు వలన రైతులకు జరిగిన పంట నష్టంపై వివరాలు నమోదు చేశామని మండల వ్యవసాయాధికారి కనకమేడల శైలజ అన్నారు. ఆమె గురువారం వివరాలు తెలుపుతూ మండల పరిధిలో చోడవరం, పెదపులిపాక, తాడిగడప గ్రామాల్లో 13 మంది రైతులకు చెందిన 25 ఎకరాల్లో జొన్న, మొక్కజొన్న పంట నష్టం జరిగినట్లు గుర్తించామన్నారు. పంట నష్టం వివరాలు నమోదు చేసి నివేదిక ప్రభుత్వానికి పంపామని తెలిపారు.

కాపు కల్యాణ మండపానికి నిధుల మంజూరుపై హర్షం

హనుమాన్‌జంక్షన్‌రూరల్: హనుమాన్‌జంక్షన్‌లో కాపు కల్యాణమండపం నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.25 లక్షలు మంజూరు చేయడం హర్షణీయమని ఏపీ నాటక అకాడమీ డైరెక్టర్, కాపునాడు నేత నక్కా గాంధీ అన్నారు. స్థానిక విలేకరులతో గురువారం ఆయన మాట్లాడుతూ.. సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కాపు కల్యాణ మండపానికి గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీ ప్రత్యేక చొరవతో నిధులు మంజూరయ్యాయన్నారు. సీఎం డెవలప్‌మెంట్ ఫండ్ నుంచి రూ.25 లక్షలు నిధులు మంజూరు చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కాపు సామాజికవర్గ సంక్షేమం, అభివృద్ధికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే వల్లభనేని వంశీ అన్నివిధాలా అండగా నిలుస్తున్నారని చెప్పారు. రెండు దశాబ్దాలుగా కాగితాలపై ప్రతిపాదనలకే పరిమితమైన కాపు కల్యాణ మండపం తాజాగా నిధులు మంజూరుతో త్వరలోనే నిర్మాణం ప్రారంభమవుతుందని గాంధీ చెప్పారు.

జ్యూట్ బ్యాగుల పంపిణీ

కోడూరు: విశ్వనాథపల్లి పీఏసీఎస్ పరిధిలోని ఖాతాదారులకు సంఘం ఆధ్వర్యంలో జ్యూట్ బ్యాగులను పంపిణీ చేశారు. సంఘ చైర్‌పర్సన్ తోట వెంకట నాంచారమ్మ చేతుల మీదగా ఈ బ్యాగులను అందించారు. పర్యావరణానికి హాని కలిగించని జ్యూట్ బ్యాగులపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని నాంచారమ్మ కోరారు. సీఈఓ చుండూరు రమేష్, వైఎస్సార్ సీపీ జిల్లా సంయుక్త కార్యదర్శి తోట దామోదరరావు, అద్దంకి నాంచారమ్మ ఆలయ చైర్మన్ ముప్పిరిశెట్టి శ్రీనివాసరావు, నాయకులు పాల్గొన్నారు.